సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం : 26 : ఆగస్టు : 2024



జూరాల గేట్లు మూసివేత
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గడంతో క్రస్ట్‌గేట్లు మూసివేశారు.

వివరాలు 8లో ▸



క్రీడలకు పెద్దపీట
రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /24.2

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వర్షాలకు నీట మునిగిన వరి పంట




శాంతినగర్: గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జూలెకల్ శివారులో సాగుచేసిన వరి పంటలు నీట మునిగాయి. జూలెకల్ శివారులో ప్రవహించే వాగు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని పొలాల్లో సాగుచేసిన వరి మొక్కలు నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో రైతులు కన్నీటి పర్యాంతమయ్యారు. గత నెల రోజుల క్రితం సాగుచేసిన వరి పంటలు కొట్టుకుపోవడంతో ఎలా బతికేదని, అప్పులు ఎలా చెల్లించేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు పొలాలను పరిశీలించి పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరారు.

'వాల్మీకులను మోసం చేస్తే ఊరుకోం'



మదనాపురం: ఎంతో కాలంగా వాల్మీకి, బోయలను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని.. దీంతో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నామని, ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకులు నగేష్, హరిశంకర్‌నాయుడు, భీమన్ననాయుడు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో వాల్మీకి బోయ సీనియర్ నాయకుడు టీకే కుర్మన్న అధ్యక్షతన ఉమ్మడి జిల్లా వాల్మీకి బోయల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం వాల్మీకి భవనం కోసం స్థలం కేటాయించిందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మగౌరవ భవనం నిర్మించాలన్నారు. వాల్మీకి బోయలను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. వాల్మీకుల పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అంతకుముందు మహర్షి వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర నాయకులు వైండింగ్ రాములు, వేణుగోపాల్, కొంకల వెంకట్‌నారాయణ, పెంటయ్య, మద్దిలేటి, బల్గెర నారాయణ, తిరుమలేష్, రమణ, ప్రవీణ్, విజయ్, మూర్తి, మీనుగ రవి, మండ్ల రామకృష్ణ, మధులత పాల్గొన్నారు.

మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ సాధారణం



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో ఆదివారం భక్తుల రద్దీ తగ్గింది. శ్రావణమాసంతో పాటు ముక్కార్లె కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో బోనాల పండుగలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వేరుశనగ, మినుముల సాగు పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. దీంతో మైసమ్మ జాతరకు భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు. సుమారు 2 వేల మంది భక్తులు మైసమ్మను దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గురుకుల కళాశాలలో 28న స్పాట్ అడ్మిషన్లు

అచ్చంపేట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం బాలుర కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొత్తం 32 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ టీసీ, బోనఫైడ్, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, 5 పాస్ ఫొటో సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

నీలినీడలు..!

బహుళ ప్రయోజనాలిచ్చే ఫ్రేమ్ మగ్గాలపై చేనేత కార్మికుల ఆశలు



కార్మికులకు అందివ్వాల్సిన ఫ్రేమ్ మగ్గాలు ఇవే

- సబ్సిడీపై ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు
- 2023లోనే జిల్లాలో 2వేలకు పైగా దరఖాస్తులు
- ప్రభుత్వం మారడంతో పథకం కొనసాగుతుందా లేదా అని కార్మికుల ఆందోళన

రాజోళి: గుంత మగ్గంతో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు గతంలో తీసుకువచ్చిన 'తెలంగాణ చేనేత మగ్గం పథకం 'లోని ఫ్రేమ్ మగ్గం ప్రతిపాదన ప్రస్తుతం అటకెక్కినట్లుందని కార్మికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. గుంత మగ్గాలు ఉన్న వారికి సబ్సిడీ కింద ఈ ఫ్రేమ్ మగ్గాలను అందిస్తే వచ్చే బహుళ ప్రయోజనాల ద్వారా వారికి ఉపాధి పెంచుతామని గత ప్రభుత్వం చెప్పడంతో కార్మికుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. కానీ అప్పట్లో తీసుకున్న దరఖాస్తుల తర్వాత మళ్లీ దానిపై ఎక్కడా ప్రభుత్వం నుంచి కూడా ప్రకటనలు రాకపోవడంతో చేనేత కార్మికులు నిరాశ చెందుతున్నారు.

బహుళ ప్రయోజనాలు

ఫ్రేమ్ మగ్గంతో బహుళ ప్రయోజనాలు అందుతాయని చేనేత కార్మికులు అంటున్నారు. ఏళ్ల తరబడి గుంత మగ్గాలపై పని చేసిన కార్మికులు మోకాళ్ల నొప్పులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా కూడా అవే మగ్గాలతో కాలం వెల్లదీస్తున్నారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే గుంత మగ్గాలోకి వర్షపు నీరు చేరి మగ్గం చెక్కలు మొత్తం తడిసిపోతున్నాయి. దీంతో పది రోజుల పాటు పనులకు అంతరాయం కలుగుతుంది. ఇలా వారి జీవనోపాధికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలాంటి సమస్యలను ఫ్రేమ్ మగ్గాల ద్వారా అదిగమించవచ్చని కార్మికులు అంటున్నారు. వీటి ద్వారా ఎక్కువ సేపు గుంతలో నిలబడాల్సిన అవసరముండదని, నీరు చేరి తడిసిపోతాయనే ఆందోళన అవసరం లేదని, వీటి వల్ల కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వీటిపై గతంలో ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే చాలా సంతోషించామని కాని నేటి వరకు దానిపై కదలిక లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

అటకెక్కిన పథకం

గత ప్రభుత్వం సబ్సిడీపై కార్మికులకు అందించేందుకు తీసుకువచ్చిన ఫ్రేమ్ మగ్గం పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతంలో ఈ పథకం తీసుకువచ్చినప్పటి ప్రభుత్వం అధికారంలో లేకపోవడం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో, ఈ పథకం అమలవుతుందా లేదా అనే ప్రశ్నలు కార్మికులను వెంటాడుతున్నాయి. పథకం యధావిధిగా కొనసాగినట్లయితే కార్మికులు చేసుకున్న దరఖాస్తులపై కదలిక వచ్చేదని కొందరు అంటుండగా, పార్టీలకు అతీతంగా కార్మికులకు మేలు చేకూర్చే పథకం కాబట్టి, ఫ్రేమ్ మగ్గాలను అందించి, చేనేత కార్మికులకు జీవనోపాధి పెంచాలని మరికొందరు కోరుతున్నారు.

2023లో 2వేలకు పైగా దరఖాస్తులు

చేనేత రంగంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్న క్రమంలో కార్మికులకు కూడా మగ్గాల్లో మార్పులు చేసి పనులు వేగంగా పూర్తయ్యేలా చూసేందుకు ఇలాంటి మగ్గాలను తెస్తున్నామని గత ప్రభుత్వం, గత ఏడాదిలో ఫ్రేమ్ మగ్గాలను ప్రతిపాదించింది. దాని కోసం చేనేత కార్మికుల నుండి దరఖాస్తులు కోరింది. గత సంవత్సరం సెప్టెంబర్ 14 నాటికి చివరి తేదీగా నిర్ణయించింది. అనంతరం లబ్ధిదారుల ఎంపిక చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఆ సమయానికి 6,948 మంది చేనేత కార్మికులు ఉండగా.. జియో ట్యాగింగ్ ప్రకారం 2,695 మగ్గాలు ఉన్నాయి. వాటిలో ఎక్కువగా గుంత మగ్గాలే కావడంతో 2 వేల మందికి పైగా కార్మికులు ఫ్రేమ్ మగ్గాలకు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రభుత్వం అమలుచేయాలి



గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్రేమ్ మగ్గాల ప్రతిపాదనను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలి. ఆ పథకంతో కార్మికులకు మేలు జరుగుతుండటంతో వాటిని కొనసాగిస్తే బాగుటుంది. ఫ్రేమ్ మగ్గాలను ఇవ్వడం వల్ల కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. చేనేత కార్మికులకు అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని గతంలో దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలి.

– నిషాక్, చేనేత గ్రామిక సేవా సమితి సభ్యుడు,రాజోళి

ఆదేశాలు రావాల్సి ఉంది..

గతంలో ఫ్రేమ్ మగ్గాల కోసం కార్మికుల నుండి దరఖాస్తులు తీసుకున్నాం. కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో దానిపై కదలిక రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం దానిపై ఆదేశిస్తే వెంటనే ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేస్తాం.

– గోవిందయ్య,చేనేత జౌళి శాఖ ఏడీ

ముంపు ముప్పు..!

■ ఈ నెల 21 నాడు.. విస్తారంగా వర్షాలు కురవడంతో గట్టు మండలంలోని చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ ముంపు గ్రామమైన చిన్నోనిపల్లె గ్రామానికి వంద మీటర్ల సమీపానికి చేరుకున్నాయి. కొన్ని పంట పొలాలు సైతం మునిగిపోవడం, ఇళ్ల వైపు నీరు వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఇళ్లు.. పొలం.. అన్నీ విడిచి భార్యాపిల్లలతో ఎలా వెళ్లాలని, ఏం చేసి బతకాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామాన్ని నీరు ముంచెత్తక ముందే రిజర్వాయర్‌లోని నీటిని బయటికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

■ 23 నాడు.. రిజర్వాయర్ నీరు బయటికి వెళ్లేందుకు కాల్వ తవ్వుతామని చెప్పినా.. పనులు ప్రారంభించకపోవడం, రిజర్వాయర్ బ్యాక్ వాటర్ గ్రామానికి మరింత చేరువ కావడంతో గ్రామస్తులు ఆందోళన తీవ్రతరం చేశారు. రిజర్వాయర్ కట్ట వద్ద నిరసన చేపట్టారు. సాయంత్రం కాల్వ పనులు ప్రారంభించినా.. దిగువ పొలాల వారు అడ్డు చెప్పడం, తహసీల్దార్, ఆర్డీఓ వారిని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

■ 24, 25నాడు.. ఎట్టకేలకు రిజర్వాయర్‌లో అదనంగా వచ్చే నీటిని బయటకు పంపే విధంగా రిజర్వాయర్ కట్ట కాల్వ పనులు షురూచేశారు. మరో రెండు రోజుల్లో కాల్వ పనులు పూర్తి కానున్నాయి. దీంతో గ్రామస్తులు కొంత ఊరట చెందారు.



చిన్నోనిపల్లె గ్రామంలోని డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్న రిజర్వాయర్ బ్యాక్ వాటర్

- బిక్కుబిక్కుమంటున్న చిన్నోనిపల్లె నిర్వాసితులు
- రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టంతో ఆందోళన
- నేటికీ ముంపు గ్రామంలోనే నివాసం
- పునరావాసంలో సౌకర్యాల కరువుతో వెళ్లేందుకు ససేమిరా..
- ఆర్డీఓ, తహసీల్దార్ల సందర్శన.. కాల్వ పనులతో ఊరట

గట్టు: చిన్నోనిపల్లె నిర్వాసితుల పరిస్థితి రెంటికి చెడిన రేవడిలా మారింది. పాత ఊరిని వదలలేక, కొత్త చోటుకు వెళ్లలేక, ఉన్న చోటే బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 101 ప్యాకేజీలో చిన్నోనిపల్లె గ్రామం దగ్గర నిర్మిస్తున్న రిజర్వాయర్ నిర్మాణానికి 2006లో శ్రీకారం చుట్టారు. 1.7 టీఎంసీల సామర్థ్యంతో సుమారు 37 కోట్లతో రిజర్వాయర్‌ను నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. 2650 ఎకరాలను భూసేకరణ చేశారు. రిజర్వాయర్‌లో చిన్నోనిపల్లె గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించారు. ఇందులో 360 ఇండ్లు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. 336 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎర్రగట్టు పునరావాస కేంద్రం కోసం స్థలాన్ని సేకరించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటికీ ఈ రిజర్వాయర్ పనులు పూర్తి చేయలేదు. చిన్నోనిపల్లె దగ్గర రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ఏకంగా 18 ఏళ్ల పాటుగా గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంటోంది. చిన్నోనిపల్లె, చాగదోన, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం గ్రామాల ప్రజలు గత ఏడాది 421 రోజుల పాటు రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఆందోళన చేపట్టారు. వీరి గోడు ఎవరు పట్టించుకోలేదు. పైగా పోలీస్ బలగాలతో రిజర్వాయర్ గ్యాప్‌ను పూడ్చి వేశారు. ఇదిలాఉండగా, పునరావాస కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించనందున ఆ గ్రామస్తులు పాత ఊరిలోనే పాడుబడ్డ ఇళ్లలోనే ఇప్పటికి జీవనం సాగిస్తున్నారు.

ఇటీవల భారీ వర్షాలతో ఆందోళన..

ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగుల్లోని వరద నీరు చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లోకి వచ్చి చేరాయి. దీంతో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చిన్నోనిపల్లె గ్రామం వైపు వస్తుండడం.. పంట పొలాలు సైతం మునిగిపోవడంతో గ్రామస్తులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. నీటి మట్టం మరింత పెరిగి నివాస సముదాయాల్లోకి నీరు చేరితే మా పరిస్థితి ఏంటి అంటూ ముంపు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ కట్ట వద్ద నిరసన తెలిపారు.

అధికారుల చర్యలతో ఉపశమనం

రిజర్వాయర్‌లో నీటిని బయటకు పంపేందుకు అధికారులు చర్యలను చేపట్టడడంతో ముంపు గ్రామస్తులు కాస్త ఊరట చెందారు. గద్వాల ఆర్డీఓ రాంచందర్, తహసీల్దార్ సరితారాణితో పాటుగా ఇంజినీరింగ్ అధికారులు మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ చిన్నోనిపల్లె రిజర్వాయర్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి రిజర్వాయర్‌లో అదనంగా వచ్చే నీటిని బయటకు పంపే విధంగా రిజర్వాయర్ కట్ట వెంట కాల్వ పనులు చేపట్టారు. ఇదిలాఉండగా, ప్రస్తుత ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యాయం చేయాలి

17 ఏళ్లగా ఎక్కడే వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తూ వచ్చాం. ఇప్పుడు ఉట్టి చేతులతో ఊరి విడిచి ఎక్కడికి పోయి, ఎట్లా బతకాలి. రిజర్వాయర్ గ్యాప్‌ను పూడ్చడం ద్వారా రెండు ఎకరాల వరి, బోరు నీట మునిగింది. పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వ పెద్దలు ఆలోచించి మాకు న్యాయం చేయాలి.

– కుర్వ వీరేష్, చిన్నోనిపల్లె

ఖాళీ చేయాలని చెప్పాం

చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులను పాత ఊరిని ఖాళీ చేసి, పునరావాస కేంద్రంలోకి వెళ్లాల్సిందిగా చెప్పాం. లేని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి అవసరమైన చర్యలను చేపడతాం.

– రాంచందర్, ఆర్డీఓ, గద్వాల



వైభవంగా తీజ్ వేడుక

అచ్చంపేటలో ఆదివారం తీజ్ ఉత్సవాలు అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల ముగింపు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు, యువతులు గోధుమ నారుతో భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. గిరిజన సంస్కృతి ఉట్టిపడింది. - అచ్చంపేట

వివరాలు 8లో..

'రాష్ట్రీయ బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి రూరల్: మహిళ, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం తరఫున ఇవ్వనున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి లక్ష్మీబాయి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 2024–25లో అందించనున్న అవార్డులకు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. వివిధ రంగాల్లో అంటే ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజికసేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి ,సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపు బాలలు అర్హులని పేర్కొన్నారు. htt p@//awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పీయూకు పెద్ద దిక్కేది..?!

మే నెలలో ముగిసిన వైస్ చాన్స్‌లర్ పదవీకాలం

- ఇన్‌చార్జ్‌గా ఐఏఎస్‌ను నియమించిన ప్రభుత్వం
- ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సైతం లేకపోవడంతో ఇబ్బందులు
- ఇప్పటికే వాయిదా పడిన స్నాతకోత్సవం
- పరిపాలన పరమైన అనుమతుల్లో తీవ్ర జాప్యం



పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి పెద్దదిక్కు లేకుండా పోయారు. వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ మే నెలలో పదవీకాలం పూర్తికాగా.. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇన్‌చార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారిని నియమించింది. అయితే ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా యూనివర్సిటీకి రాలేదు. దీంతో కొన్ని అకాడమిక్ పరమైన అంశాల్లో నిర్ణయం, అనుమతి కోసం అధికారులే నేరుగా హైదరాబాద్ వెళ్లి సదరు ఐఏఎస్‌తో అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో పీయూ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాయి. వాటి విషయంలో నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యమైన వారు లేకపోవడంతో అభివృద్ధి మందగించే అవకాశం ఉంది. ఇటు వైస్‌చాన్స్‌లర్, అటు ఎగ్జిక్యూటీవ్ కమిటీ లేకపోవడంతో పీయూలో అనేక సమస్యలు వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి పనులపై ప్రభావం

పీయూలో రెగ్యులర్ వీసీ లేకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. ఇన్‌చార్జ్ వీసీ ఉన్నప్పటికీ పీయూకు రాకపోవడంతో కీలక అంశాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పీయూలో పూర్తయిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసినా అవి ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ముఖ్యంగా బాలికల హాస్టల్‌ను ప్రారంభించినా వారికి అప్పగించలేదు. ఇంకా వీటిలో బెడ్‌లు, మంచాలు, కప్ బోర్డులు తదితర వసతులు కల్పించాల్సి ఉంది. ఇక రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించి, ప్రారంభించారు. కానీ, ఇక్కడ కూడా సిబ్బంది, క్రీడా సామగ్రి లేకపోవడంతో వృథాగా మారింది. ఇందులో చాలాచోట్ల వర్షపు నీరు నిలవడం, పిచ్చి మొక్కలు మొలిచి ట్రాక్ పాడవుతోంది. ఇక క్యాంటీన్ పరిస్థితి కూడా అలాగే ఉంది. కేవలం భవనాన్ని మాత్రమే నిర్మించిన కాంట్రాక్టర్ ఎలక్ట్రిఫికేషన్, ప్లంబింగ్, ఫినిషింగ్ పనులు పూర్తి చేయలేదు. అయితే వీసీ లేకపోవడంతోనే ఇవేవీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. ప్రస్తుతం ఉన్న అధికారులు వీటిపై దృష్టిసారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏర్పాట్లు చేసి.. వాయిదా

మే నెలాఖరులో పీయూ స్నాతకోత్సవం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అందులో భాగంగా యూజీ, పీజీలో సుమారు 90 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ సైతం ప్రకటించారు. తర్వాత గవర్నర్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేయగా.. జూన్ వరకు ఎలాంటి సమాచారం రాలేదు. ఈలోగా వీసీ పదవీకాలం పూర్తి అయ్యింది. ఇప్పటికీ రెగ్యులర్ వీసీ లేకపోకపోవడంతో స్నాతకోత్సవ కార్యక్రమం నాలుగు నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. అయితే కొత్త వీసీ వచ్చాక కాన్వకేషన్ నిర్వహించాల్సి వస్తే ప్రస్తుతం డిగ్రీ, పీజీ చివరి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వీరికి కూడా మెడల్స్ ఇవ్వాలి. అదే జరిగే మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించాలి. ఇక మూడోసారి అధికారులు యూజీసీ న్యాక్ కోసం దరఖాస్తు చేయగా.. త్వరలోనే కమిటీ పీయూను సందర్శించనుంది. ఈ క్రమంలో వీసీ లేకపోతే పలు రకాల ఇబ్బందులు తప్పవని, వెంటనే వీసీని నియమించాలని డిమాండ్ వినిపిస్తోంది.

పెండింగ్‌లో కీలక నిర్ణయాలు

పీయూలో ఆర్థిక, అభివృద్ధిపరమైన అంశాల్లో నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యేక ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్‌ను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఇందులో 13 మంది సభ్యులతో కూడిన కౌన్సిల్ ఉంటుంది. ఎక్స్ అఫీషియో సభ్యులు 5 మంది విద్యాశాఖ, ఆర్థిక శాఖ, ఉన్నత విద్య కార్యదర్శులు, వీసీ, రిజిస్ట్రార్, ఉంటే నామినేటెడ్ సభ్యులు 8 మంది సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. ఇందులో యూనివర్సిటీకి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోవచ్చు. కాగా నాలుగు నెలల క్రితం గతంలో నియమించిన ఈసీ పదవీకాలం ముగిసింది. దీంతో ఇటీవల యూనివర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించినా.. కొత్తగా ఎలాంటి నిర్ణయాలను తీసుకోలేదు. నిధుల ఖర్చు, కొత్త భవనాల నిర్మాణం, సిబ్బంది వేతనాలు తదితర వన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. అత్యవసర నిర్ణయాల కోసం ఎక్స్ అఫీషియో మెంబర్స్ (ఎంఎన్‌డీసీ)తో మేనేజ్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ ఉన్నప్పటికీ ఎప్పుడూ సమావేశం నిర్వహించలేదు.

ఇబ్బందులు లేవు..



పీయూలో పరిపాలన పరమైన ఇబ్బందులు లేవు. ఇన్‌చార్జ్ వీసీ అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ ఏ విషయంలోనైనా సహకరిస్తున్నారు. ఈసీ విషయంలో ఎంఎన్‌డీసీ ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంది. వీలైనంత త్వరగా వీసీని నియమిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

– మధుసూదన్‌రెడ్డి, పీయూ రిజిస్ట్రార్


తీజ్ బుట్టలతో అమ్మాయిలు, మహిళలు


అచ్చంపేట గిరిజన్ భవన్ వద్ద పూజలు చేస్తున్న పూజారులు


ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

జాగో బంజారా.. బొరావ్ తీజ్

ఘనంగా మొలకల పండుగ

- ఆకట్టుకున్న యువతుల సంప్రదాయ నృత్యాలు
- ఉట్టిపడిన గిరిజన సంస్కృతి
- మొలకలతో భారీ ఊరేగింపు.. నిమజ్జనం
- ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులు


ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: జాగో బంజారా.. బొరావ్ తీజ్ అంటూ ఆదివారం గిరిజనులు మొలకల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ నెల 17న తీజ్ వేడుకలు ప్రారంభం కాగా.. తొమ్మిది రోజులపాటు కనుల


తీజ్ బుట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గిరిజనులు

పండువగా నిర్వహించారు. గిరిజన భవన్ వద్ద బుట్టల్లో నాటిన గోధుమ నారుకు రోజు ఉదయం, సాయంత్రం యువతులు సంప్రదాయ పాటలు పాడుతూ నీరు పోశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా యువతులు, మహిళలు మొలకలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ వాయిద్యానికి వారు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తీజ్ ఉత్సవాల్లో గిరిజన సంస్కృతి ఉట్టిపడింది. తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా పాల్గొన్నారు. అచ్చంపేటలో ప్రత్యేకంగా నిర్వహించే మొలకల పండుగను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నల్లగొండ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి గిరిజన బంధువులు తరలివచ్చారు.

చెరువులో నిమజ్జనం..

గిరిజన భవన్ వద్ద పందిరిపై ఏర్పాటు చేసిన తీజ్



బుట్టలను కిందకు తీసుకువచ్చిన అనంతరం ఆట పాటలతో తీజ్ నారును తెంపారు. తెంపిన గోధుమ నారును వరుస క్రమంలో కూర్చున్న పెద్దలు, యువకులు తలపాగా, జేబుల్లో పెట్టారు. అనంతరం రేగుచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గోధుమ నారు (డోనా), చిన్నకర్ర (పీట)లతో యువతీ యువకులు ఒకరినొకరు ఆట పట్టించుకున్నారు. అక్కడి నుంచి మొలకల బుట్టలను యువతులు తలపై పెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా నడింపల్లి చెరువు వద్దకు బయల్దేరారు. చెరువు వద్ద తమ సంప్రదాయ పద్ధతులతో మొలకల బుట్టలకు పూజలు నిర్వహించి, చెరువులో నిమజ్జనం చేశారు. పూజలో పాల్గొన్న అమ్మాయిలు తీసుకున్న రొట్టెలు, ఆకుకూరల ఆహారాన్నే సంప్రదాయ రీతిలో అందరూ అక్కడ తీసుకున్నారు. అనంతరం తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించిన గిరిజన భవన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ యువతులు పెద్ద మనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. అమ్మాయిల కాళ్లను కూడా పెద్దమనుషులు కడిగి వారిని ఆశీర్వదించారు.

- తీజ్ ఉత్సవాల్లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. గిరిజన భవన్ వద్ద గిరిజన సంఘం నాయకులు వారికి రుమాలు కట్టి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవాలు అని అన్నారు. గిరిజన మహిళలు, యువతీ యువకులు ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాగా, ఊరేగింపులో గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, గిరిజన నాయకులు బిచ్చానాయక్, తులసీరాం, కె.రాములు నాయక్, లచ్చునాయక్, మంత్రానాయక్, మూడావత్ రాములు నాయక్, శంకర్ రాథోడ్, మోహన్ లాల్, దేశ్యానాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సంప్రదాయ దుస్తుల్లో గిరిజన మహిళలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల ఘర్షణ

తీజ్ ముగింపు ఉత్సవాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. అచ్చంపేట గిరిజన భవన్ నుంచి తీజ్ ఊరేగింపు ప్రారంభం కాగా.. ప్రధాన రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి చేరుకున్న తర్వాత మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ తిరిగి అక్కడి రాగా ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలు కావడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అక్కడి నుంచి పంపించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత మళ్లీ గొడవ మొదలు కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్య పరిష్కరించడంతో గిరిజనులు ఉత్సవాలను సంతోషంగా జరుపుకొన్నారు. 2021 ముగింపు ఉత్సవాల్లోనూ అప్పటి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల మధ్య ఇలాంటి ఘర్షణే చోటుచేసుకుంది. ఇప్పుడు మళ్లీ రెండు పార్టీల మధ్య ఘర్షణ జరగడంపై పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట


మాట్లాడుతున్న రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి

- గ్రామస్థాయి నుంచి సీఎం కప్
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో ఆదివారం 5వ రాష్ట్రస్థాయి అండర్- 16 (యూత్) బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పతకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా జిల్లాల జట్లు మార్చ్‌పాస్ట్ నిర్వహించగా జితేందర్ రెడ్డి, యెన్నం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందన్నారు. బాస్కెట్‌బాల్ క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తెలంగాణలో స్పోర్ట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించినట్లు వివరించారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతామన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 నుంచి సీఎం కప్ ప్రారంభమై అదే నెల 21 నుంచి నవంబర్ 24 వరకు సీఎం కప్ క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్, రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నోమన్ ఐజాక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, జిల్లా ఫుట్‌బాల్


ఇండోర్ స్టేడియంలో వికారాబాద్- నల్లగొండ జిల్లాల జట్ల బాలికల మ్యాచ్


మహబూబ్‌నగర్- రంగారెడ్డి జట్ల మధ్య మ్యాచ్

సంఘం అధ్యక్షులు ఎస్పీ వెంకటేశ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ, మీర్ అర్షద్‌అలీ, ఎండీ ఇలియాజ్, ఖాలెద్‌అలీ, ఖలీల్, సుభాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు మ్యాచ్‌ల ఫలితాలు

రాష్ట్రస్థాయి అండర్- 16 అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీలో 17 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. అయితే బాలుర విభాగం మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 26- 18 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్‌పై, మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 26- 6 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్‌పై గెలుపొందాయి. బాలికల విభాగంలో రంగారెడ్డి జట్టు 26- 11 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్‌పై విజయం సాధించాయి. ఇతర బాలుర విభాగం మ్యాచుల్లో మహబూబాబాద్ 29- 23 తేడాతో సూర్యాపేటపై, నిజామాబాద్ జట్టు 24- 2 తేడాతో మంచిర్యాలపై, కామారెడ్డి జట్టు 31- 4 తేడాతో మంచిర్యాలపై, జగిత్యాల జట్టు 16- 2 తేడాతో కరీంనగర్‌పై, ఖమ్మం జట్టు 13- 2 తేడాతో హన్మకొండపై గెలుపొందాయి. హైదరాబాద్ జట్టు 39- 24 తేడాతో రంగారెడ్డి జట్టుపై, వికారాబాద్ జట్టు 16- 5 తేడాతో నల్లగొండపై, మేడ్చల్ మల్కాజ్‌గిరి 22- 4 తేడాతో కరీంనగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 13- 4 తేడాతో సూర్యాపేటపై, నల్లగొండ జట్టు 12- 10 తేడాతో మెదక్‌పై, ఆదిలాబాద్ జట్టు 25- 8 తేడాతో మహబూబాబాద్‌పై గెలుపొందాయి.

- బాలికల విభాగం మ్యాచుల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరి 14- 6 తేడాతో జగిత్యాలపై, వికారాబాద్ జట్టు 41- 14 మెదక్‌పై విజయం సాధించాయి. ఖమ్మం 20-6 తేడాతో మంచిర్యాలపై, హన్మకొండ 17- 10 తేడాతో మహబూబాబాద్‌పై, జగిత్యాల 13- 7 తేడాతో కామారెడ్డిపై, నల్లగొండ జట్టు 21- 11 తేడాతో మెదక్‌పై, నిజామాబాద్ 27- 10 మంచిర్యాలపై, కరీంనగర్ జట్టు 14- 10 తేడాతో హైదరాబాద్‌పై, వికారాబాద్ 19- 10 తేడాతో నల్లగొండపై, నిజామాబాద్ 14- 2 తేడాతో ఖమ్మంపై, మేడ్చల్ మల్కాజ్‌గిరి 44- 0 తేడాతో కామారెడ్డిపై, మహబూబాబాద్ 10- 0 తేడాతో సూర్యాపేట జట్లపై విజయాలు సాధించాయి.

జూరాల క్రస్ట్‌గేట్లు మూసివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి వరకు 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం సాయంత్రానికి 31 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. దీంతో జలాశయం క్రస్ట్‌గేట్లు మూసివేసినట్లు చెప్పారు. ఆవిరి రూపంలో 92, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వకు 485, ఎడమ కాల్వకు 550, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.611 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల జలాశయం దిగువ, ఎగువ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోందని.. ఆదివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలోని 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 109.118 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 84.216 ఎంయూ విద్యుదుత్పత్తి చేసినట్లు వివరించారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 193.334 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు. విద్యుదుత్పత్తికి 38 వేల క్యూసెక్కుల నీటని వినియోగించి దిగువ శ్రీశైలం జలాశయానికి వదులుతున్నామని చెప్పారు.

నిండుకుండలా రామన్‌పాడు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల వరద వస్తుండగా, సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వకు 500, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు.

శ్రీశైలంలో 883.9 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 883.9 అడుగుల నీటిమట్టం, 209.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 39 వేలు, సుంకేసుల నుంచి 6,759 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30 వేలు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,704, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి క్యాబ్‌డ్రైవర్ ఆత్మహత్య


రాజేందర్(ఫైల్)

వెల్దండ: ఎర్రవల్లితండాలో ఆదివారం మూనావత్ రాజేందర్(28) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజేందర్ హైదరాబాదులో క్యాబ్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగానే ఉదయం ఇంటికి వచ్చిన రాజేందర్.. ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినా అప్పటికే మృతి చెందాడు. రాజేందర్‌కు భార్య రజితతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచనల మేరకు సూగురి శ్రీను రూ. 3వేలు ఆర్థికసాయం అందించారు. అయితే రాజేందర్ మృతి గల కారణాలు తెలియరాలేదు. విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డ్రాయింగ్ టీచర్..

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రాగాంజన్‌రెడ్డి(33) ఆదివారం వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన భార్య, పిల్లలతో కలిసి కర్నూల్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జడ్చర్ల: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బూర్గుపల్లిలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పోల వెంకటయ్య(42) ఈ నెల 23న గ్రామంలో పొలం పనికి కూలీకి వెళ్లాడు. సాయంత్రం దాటిన ఇంటికి తిరిగి రాలేదు. భార్య శాంతమ్మ వెతికినా లాభం లేదు. 24న కుటుంబ సభ్యులతో కలిసి వెంకటయ్యను వెతుకుతున్న కావలియాదయ్య పొలంలో కిందపడి చనిపోయి కనిపించాడు. దీంతో భర్త మరణంపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

ఊట్కూరు: యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణంరాజు ఆదివారం తెలిపారు. మండలంలోని కొల్లూరుకు చెందిన డ్రైవర్ నరేష్‌కు గతంలోనే వివాహమైనప్పటికీ.. అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చూసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని కోరగా మొహం చాటేశాడు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పెళ్లికి నిరాకరించడంతో యువతి పోలీసులను ఆశ్రయించింది.

జోగుళాంబకు సారె సమర్పణ


స్వాగతం పలుకుతున్న అర్చకులు

- కర్నూలులోని బాలాజీ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన బాలాజీ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 300 మందికిపైగా మహిళలు జోగుళాంబ ఆలయానికి చేరుకున్నారు. చీర, సారెతో గాంధీచౌక్ నుంచి ఆలయానికి కోలాటం ఆడుతూ ర్యాలీగా చేరుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ స్వాగతం పలికారు. ముందుగా గణపతికి ప్రత్యేక అభిషేకాలు, అనంతరం ప్రధాన ఆలయంలో బాలబ్రహ్మేశ్వరుడు, జోగుళాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే కుంకుమార్చన మండపంలోని శ్రీచక్రం దగ్గర తీసుకొచ్చిన మిఠాయిలు, పూలు, పండ్లు, ఒడిబియ్యం, మంగళద్రవ్యాలు సమర్పించారు. అక్కడే లలితా, విష్ణు సహస్రనామ పారాయణాలు, భజనలు, సాంస్కృతిక నృత్యాలు చేశారు. అనంతరం జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

సహపంక్తి భోజనాలు..

పూజా కార్యక్రమాల భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఆలయ ఆవరణలో ట్రస్ట్ తరఫున సహపంక్తి భోజనాలు చేశారు. సమాజంలో భక్తిని పెంపొందించేందుకు ట్రస్టు తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇటీవల మహానంది క్షేత్రంలో కూడా చీర, సారె సమర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం జోగుళాంబ ఆలయంలో అమ్మవారికి పుట్టించి పట్టుచీర పేరిట ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు.

సైబర్ మోసం

- రూ.95,800 స్వాహా చేసిన కేటుగాళ్లు

జడ్చర్ల: ఓ మహిళ సైబర్ నేరగాళ్ల బారినపడి ఘటన చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. భవానినగర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ కౌసల్య ఇంటికి ఈ నెల 6న అక్క, ఆమె కుమార్తెలు వచ్చారు. దీంతో ఆ చిన్నారులకు తన ఫోన్‌ను ఇవ్వగా.. ఫోన్‌లో వచ్చిన మెస్సేజ్‌ను డౌన్‌లోడ్ చేయగా వెంటనే ఆమె ఖాతా నుంచి రూ.95,800 ఖాళీ అయ్యాయి. వెంటనే ఆమె సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసింది. ఆదివారం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బస్సులో నుంచి దూకేసిన మహిళ

మాగనూర్: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులో నుంచి మహిళ దూకేయగా తలతీవ్ర గాయాలైన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు చెందిన బసమ్మ మాగనూర్‌లో సరకుల నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో తెలంగాణ ఆర్టీసీ బస్సు మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో ఎక్కింది. కొంత దూరం వెళ్లాక కండక్టర్ టికెట్ నిమిత్తం డబ్బులు అడుగగా.. ఆమె వద్ద సంచి అనుమానాస్పదంగా కనిపించడంతో కండక్టర్ తెరిచి చూడగా అందులో కల్లు ప్యాకెట్లు ఉన్నాయి. వాటితో బస్సులో ప్రయాణించకూడదని బస్సును పక్కకు ఆపుతామని దిగిపోవాలని మహిళకు సూచించాడు. భయపడిన మహిళ వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి దూకేసింది. దీంతో తలకు గాయాలు కాగా సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాయచూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పెద్దవాగు పిల్లర్ వద్ద మరమ్మతు


పనులు పరిశీలిస్తున్న అధికారులు

అడ్డాకుల: కందూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జిలో మొదటి పిల్లర్ వద్ద రంధ్రం ఏర్పడి వరద నీళ్లు అందులోంచి వెళ్తున్న నేపథ్యంలో.. రహదారి నిర్వాహకులు సకాలంలో అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ దీపా మాడియా, ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్‌కుమార్, మేంటెనెన్స్ మేనేజర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో హిటాచీ సాయంతో రంధ్రం పూడ్చే పనులు చేపట్టారు. చెక్‌డ్యాం నుంచి గుడిబండ వైపు నీళ్లు వెళ్లకుండా కాల్వలో ఇసుక సంచులు వేశారు. అయితే వాగులో మొదటి పిల్లర్ కింది భాగంలో పక్క పక్కనే రెండు పిల్లర్లు భూమి లోపలికి ఉండగా వాటి మధ్యలో ఉండే ఖాళీ నుంచి నీళ్లు ఒక వైపు నుంచి మరో వైపుకు నీళ్లు వెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే చెక్‌డ్యాం నుంచి గుడిబండ చెరువుకు వెళ్లే నీళ్లు పిల్లర్ పక్క నుంచి వెళ్లే చోట ఇసుకతో సంచులు వేశారు. పిల్లర్ రంధ్రం వద్ద వరి గడ్డి వేస్తూ దానిపై మట్టిని వేసి .. నీళ్లు పిల్లర్ వద్దకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. తర్వాత ఇసుకతో కూడిన సంచులను పిల్లర్ రంధ్రంలో వేసి మూసేశారు. పనులను నీటిపారుదలశాఖ డీఈ వెంకట రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చందర్‌నాయక్ పరిశీలించారు. తర్వాత గుడిబండ చెరువుకు నీళ్లు వెళ్లేలా ఇసుక సంచులను తొలగించారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి పాత బ్రిడ్జిపై వెళ్లే ట్రాఫిక్‌ను కొత్త బ్రిడ్జిపైకి మళ్లించగా ఆదివారం మధ్యాహ్నం పనులు పూర్తయిన తర్వాత పాత బ్రిడ్జిపై వాహనాలను అనుమతించినట్లు రూట్ ఆఫీసర్ తేజ స్వరూప్ తెలిపారు. కార్యక్రమంలో మేంటెనెన్స్ అసిస్టెంట్ మేనేజర్ జితేంద్ర తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లర్ల ఆస్తుల జప్తు సరికాదు


మాట్లాడుతున్న రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లపై చిన్న చూపు చూస్తూ.. నిబంధనలు పాటించడం లేదని ఆస్తులు జప్తు చేయడం సరికాదని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి అన్నారు. విలియంకొండ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాష్ట్రంలోని రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో నలుగురు రైస్‌మిల్లుల యజమానుల ఇళ్లలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఆస్తులను జప్తు చేయడంపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పి, ధాన్యం ఎలా ఉందో చూడకుండా రైస్‌మిల్లర్లకు కేటాయిస్తుందన్నారు. తద్వారా మిల్లర్లకు నష్టం వాటిల్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రైతులు, ప్రజలకు బాసటగా ఉంటున్న మిల్లర్లను అధికారులు దోషులుగా చిత్రీకరిస్తూ ఇబ్బందులకు గురిచేయడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేయించుకుని బియ్యం తీసుకుంటే మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. నెలల తరబడి గోదాంలో ధాన్యం ఉండటంతో మిల్లుల యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ పేరుతో మిల్లర్ల ఇళ్లపై దాడులు చేయడం తగదన్నారు. సెప్టెంబర్ చివరి వరకు సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా.. ముందుగానే మిల్లర్లపై ఒత్తిడి తీసుకొచ్చి దాడులు చేస్తున్నారని అన్నారు. వనపర్తి జిల్లాలో అధికారుల ఒత్తిడితో ఇద్దరు రైస్‌మిల్లర్లు గుండెపోటుతో మృతిచెందారని తెలిపారు.

